క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఐ.పోలవరం: మండలంలోని తీరప్రాంత గ్రామం అయిన భైరవపాలెం గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడికి సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు ఉంటుంది. కుడి చేతిపై 786 పచ్చబొట్టు, ఎడమ చేతిపై లవ్ సింబల్ ఉందన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

మహిళల సామూహిక కుంకుమ పూజలు

అమలాపురం రూరల్: బండారులంక మట్టపర్తివారిపాలెం రామాలయం వద్ద 15వ వినాయక వార్షికోత్సవం సందర్భంగా సిద్ధి బుద్ధీ సమేత వరసిద్ధి వినాయక స్వామివారి పందిరిలో శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. పురోహితులు బళ్ల గోపీనాథ్ బ్రహ్మత్వాన స్వామివారికి మహిళలు, భక్తులు పూజలు చేశారు. అనంతరం పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కడలి రాజు, మట్టపర్తి అజయ్, మామిడిశెట్టి విష్ణు, మట్టపర్తి వరప్రసాద్, కడలి రామకృష్ణ, మట్టపర్తి కృష్ణ నాగేంద్ర, మట్టపర్తి పండు సేవలందించారు.

పేరూరులో 24, 25 తేదీల్లో రుక్మిణీ కల్యాణం

అమలాపురం రూరల్: పేరూరులో ద్రావిడ శ్రేయోదాయక భవనంలో ఈ నెల 24, 25 తేదీల్లో రుక్మిణీ కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆనంద్ బ్రాహ్మణ ఉచిత వివాహ కేంద్రం నిర్వాహకులు అయ్యల సోమయాజుల బ్రహ్మనందం తెలిపారు. 24వ తేదీ ఉదయం 8 గంటలకు రుక్మిణీ కల్యాణం కురవి గోపికృష్ణ ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన చెప్పారు. అనంతరం రుక్మిణీ కల్యాణం పారాయణ నిర్వహిస్తామని తెలిపారు. 25వ తేదీ సాయంత్రం సామవేదం షణ్ముఖ శర్మ రుక్మిణీ కల్యాణం ప్రవచనం ఉంటుందని చెప్పారు.

చెస్ పోటీలకు సిరి ఎంపిక

ఐ.పోలవరం: మండలంలోని కొమరగిరి జెడ్పీ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న పసుపులేటి సిరి రాష్ట్ర స్థాయి అండర్ 14 చెస్ పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్ఎం కె.శ్రీనివాసరావు, పీడీ ఐ.విజయ తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ నెల 13న కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి చెస్ పోటీల్లో అర్హత సాధించిందని తెలిపారు. ప్రతిభ కనబరచిన సిరిని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, ఎంపీటీసీ సఖిలే పద్మావతి, సర్పంచ్ వరసాల విజయ చాముండేశ్వరి దేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏలూరి ఆదినారాయణ, విద్యాకమిటీ చైర్మన్ కె.శివకుమార్ అభినందించారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా ఈ నెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించాలని విజయవాడలో జరిగిన వామపక్షాల రౌండేబుల్ సమావేశం తీర్మానించింది. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా అమలాపురంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు, ఎత్తురోడ్డులోని సీపీఐ కార్యాలయం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శులు కారెం వెంకటేశ్వరరావు, కె.సత్తిబాబు ఒక ప్రకటనలో తెలియజేశారు.

28న మిలాద్‌ఉన్‌నబీ సెలవు

యానాం: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని మిలాద్-ఉన్-నబీ పబ్లిక్ హాలీడేను మార్పు చేస్తూ పుదుచ్చేరి హోంశాఖ కార్యదర్శి ఎంపీ హీరాన్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా యానాంలో అన్ని పుదుచ్చేరి ప్రభుత్వ అండర్ టేకింగ్స్, బోర్డులు, అన్ని బ్యాంకులు, కోపరేటివ్ బ్యాంకులకు ఈ నెల 28వ తేదీన సెలవుగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

అమలాపురం రూరల్ : జీపీఎస్ వ్యతిరేకిస్తూ సాకుర్రు ఉన్నత పాఠశాలలో నల్లరిబ్బన్లు ధరించి ఉపాధ్యాయులు నిరసన తెలిపారు ప్యాప్టో సంఘం నాయకులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్య పల్లంరాజు, పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

శిఖామణికి మాధవరావు స్మారక సాహితీ పురస్కారం


శిఖామణి

యానాం: కవిసంధ్య సంపాదకుడు, కళారత్న డాక్టర్ శిఖామణి పాలకొల్లుకు చెందిన బుంగా లలితా మాధవరావు స్మారక సాహితీ పురస్కారం -2023కు ఎంపికయ్యారు. ఈ మేరకు సాహితీ పురస్కార ఎంపికపై శుక్రవారం తనకు సమాచారం అందిందని శిఖామణి తెలిపారు. తమ తల్లిదండ్రుల పేరుపై సాహితీ పురస్కారాన్ని ఏర్పాటు చేసినట్లు విశ్రాంత ఉపాధ్యాయిని బుంగా జెస్సీకళ ప్రకటనలో తెలిపారు. విద్యా చైతన్య సమాఖ్య పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న పాలకొల్లులో జరిగే పురస్కార సభలో రూ.20 వేల నగదు, జ్ఞాపిక, దుశ్శాలువాతో శిఖామణికి సత్కారం ఉంటుందని సమాఖ్య అధ్యక్షుడు పోలిశెట్టి శ్రీశ్రీ తెలియజేశారు.

అప్రమత్తతే శ్రీరామరక్ష


వరి చేలలో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

- పురుగు మందు పిచికారీలో జాగ్రత్తలు తప్పనిసరి
- నిర్లక్ష్యంతో ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం
- శరీరం నిండా దుస్తులు ధరించాలి
- నోటికి, ముక్కుకు మాస్క్ ఉండాలి
- వ్యవసాయాధికారుల సూచనలు

ముమ్మిడివరం: మండలంలో వరి పంటలో చీడపీడల నివారణకు రైతులు పురుగు మందులను పిచికారీ చేయడంలో బిజీగా ఉన్నారు. పంటలను చీడపీడల నుంచి రక్షించుకునే ప్రయత్నంలో కొందరు కూలీలు, రైతులు కనీస జాగ్రత్తలను కూడా తీసుకోవడం లేదు. దీనివల్ల కొన్ని సందర్భాలలో ప్రాణాలను కూడా కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగు మందుల పిచికారీలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేస్తున్నారు. ఒకోసారి ఎంత అప్రమత్తంగా ఉన్నా విష ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. మూడు రకాలుగా పురుగు మందులు శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉందని చెబుతున్నారు.

చర్మం ద్వారా ...

పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో విషం చర్మం నుంచి శరీరంలోకి ప్రవేశించే ప్రమాదముంది. శరీరంపై పుండ్లు, గాయాలు ఉంటే మరింత సులభంగా శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఆ తరువాత ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.

ముక్కు ద్వారా...

క్రిమిసంహారక మందుల పిచికారీ ద్వారా వెలువడే వాయువులను పీల్చడం ద్వారా విషం శరీరంలోకి ప్రవేశించి హాని కలిగిస్తాయి. తరచూ ఇదే రకంగా పీలుస్తుంటే ముక్కు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువ.

నోటి ద్వారా ...

పురుగు మందులు పిచికారీ చేశాక చేతులు శుభ్రంగా కడుక్కోకుండా ఆహార పదార్థాలు భుజిస్తే నోటి ద్వారా విష పదార్థాలు శరీరంలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఒక్కొక్కప్పుడు మందు ప్రభావం ఎక్కువై మరణం కూడా సంభవిస్తుంది.

ఇలా చేయాలి...

చర్మం ద్వారా విష పదార్థాలు శరీరంలోకి ప్రవేశిస్తే వెంటనే సబ్బు, మంచినీటితో శుభ్రంగా కడగాలి. ఒకవేళ కళ్లలో పడితే మంచినీటితో కడగాలి. చికిత్స కోసం వెంటనే దగ్గరలోని వైద్యుడిని సంప్రదించాలి. ముక్కుతో పీల్చితే విష ప్రభావానికి గురైన వ్యక్తిని గాలి, వెలుతురు బాగా వచ్చే ప్రదేశంలో ఉంచాలి. శ్వాస తీసుకోవడం కష్టంగా ఉంటే వెంటనే కృత్రిమ శ్వాస అందించాలి. వీలైనంత త్వరగా వైద్యుని వద్దకు తీసుకువెళ్లి చికిత్స అందించే ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందు నోటి ద్వారా కడుపులోకి వెళితే వాంతి చేయించే మార్గాలను అన్వేషించాలి. గ్లాసుడు నీళ్లలో ఉప్పు లేదా ఆవాల పొడి కలిపి తాగించాలి.

జాగ్రత్తలు పాటించాలి



క్రిమి సంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు శరీరంపై నిండా దుస్తులు ధరించాలి. ముక్కు, నోటికి గుడ్డ మాస్క్ ధరించాలి. లేదా సేఫ్టీ సూట్ ధరించి పిచికారీ చేయాలి

– ఎస్.ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్
- ఉప్పలగుప్తంలో గడపగడపకూ మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల వివరాలను లబ్ధిదారునికి వివరిస్తున్న శ్రీకాంత్ తదితరులు

ఉప్పలగుప్తం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ఉప్పలగుప్తం గ్రామంలో సచివాలయం 2 పరిధిలో ఉన్న పేరాయిచెరువు, ఏటిమెరక, సత్తియ్యనాయుడుపాలెం, బడుగువారిపేట ప్రాంతాల్లో శుక్రవారం అధికారులతో కలసి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండోరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరించాలని కోరారు. ప్రతి పేద మహిళకు లబ్ధి చేకూరేలా సీఎం జగన్ సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. చదువుకుంటున్న విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు చేయూత వంటి పథకాలతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీను, మండల పార్టీ అధ్యక్షుడు బద్రిబాబ్జి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, మోటూరి సత్యంకాపు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, పోతుమూడి కొండబాబు, పెయ్యల రమణ, యనమదల పల్లంరాజు, మెసలి శ్రీనువాసరావు, నడింపల్లి సుబ్బరాజు పాల్గొన్నారు.

పాఠశాల భవనాల కూల్చివేతకు వేలం పాట

రూ.1.07 లక్షల ఆదాయం

తాళ్లరేవు: మండల పరిధిలోని తాళ్లరేవు, సుంకరపాలెం గ్రామ పంచాయతీలలో శిథిలస్థితికి చేరుకున్న రెండు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల భవనాలను కూల్చివేసి, సంబంధిత మెటీరియల్ తీసుకుపోయేందుకు శుక్రవారం బహిరంగ వేలం పాటలు జరిగాయి. మండల పరిషత్ కార్యనిర్వహణాధికారి చింతా మోహనకృష్ణ ఈ వేలం నిర్వహించారు. తాళ్లరేవులోని ఆదర్శ పాఠశాల భవనానికి సంబంధించి కొల్లు శ్రీనివాసరావు రూ.91 వేలకు హెచ్చు వేలంపాట ద్వారా దక్కించుకున్నారు. సుంకరపాలెం పంచాయతీ బాబానగర్ స్కూలు భవనాన్ని గ్రామానికి చెందిన నాగాబత్తుల వెంకటేశ్వర్లు రూ.16 వేలకు దక్కించుకున్నారు. ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీను, తాళ్లరేవు, సుంకరపాలెం పంచాయతీ కార్యదర్శులు నున్న శంకర నారాయణ, జ్యోతిసుధ పాల్గొన్నారు.

భూ రీసర్వేకు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో వసంతరాయుడు

ఉప్పలగుప్తం: గ్రామాల్లో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న జగనన్న భూ సర్వే శాశ్వత భూహక్కు పథకంతో భూవివాదాలు తీరుతాయని, దీనికి ప్రతి ఒక్కరూ సహకరించి, సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో బి.వసంతరాయుడు సూచించారు. మండలంలోని నంగవరం గ్రామంలో రైతులు, అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రీసర్వే నత్తనడకన నడుస్తోందన్నారు. పెద్ద గ్రామాల్లో పనులు వేగవంతం చేసి, చిన్న గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకానికి సహకరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరావు, తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ శీలం సూరిబాబు, గుండుమోగుల వెంకట నారాయణ, డీటీ వైవీవీఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియోలో 100 శాతం సర్వే


ఓ ఇంటి వద్ద పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అల్లవరం: ఐదేళ్ల నుంచి 17 ఏళ్లు లోపు పిల్లలు బడుల్లోనే ఉండాలన్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో సర్వేను 100 శాతం పూర్తి చేశామని ఎంపీడీఓ కృష్ణమోహన్ అన్నారు. కొమరగిరిపట్నం సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వేపై సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఇప్పటి వరకు 54 శాతంతో 6,919 కుటుంబాల సర్వే నిర్వహించి 3,201 మందికి మూడు రకాల పరీక్షలు నిర్వహించామన్నారు. గోడిలంకలో ఇంటింటా జరుగుతున్న సర్వేని ఆయన పరిశీలించారు. అనంతరం తుమ్మలపల్లి సచివాలయంలో ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎంపీటీసీ సభ్యుడు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, డాక్టర్ శాంతిప్రియ, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య పరిష్కారంపై హర్షం


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ, పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

తాళ్లరేవు: మండల పరిధిలోని రొయ్యల కంపెనీలు, షెడ్ల నిర్వహణకు సంబంధించి తలెత్తిన వివాదం పరిష్కారం కావడంపై రొయ్యల కంపెనీల యజమానులు, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కోరంగిలో అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ రొయ్యల కంపెనీలు, హెడ్‌లెస్ ప్లాంట్ల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందంటూ కొందరు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. లేనిపోని ఫిర్యాదుల వల్ల కంపెనీలు మూతపడి సుమారు 8 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన కలెక్టర్ కృతికా శుక్లాను ప్రతినిధులు, కార్మికులతో పాటు కలిసి వారు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించారన్నారు. తక్కువ ఖర్చుతో శుద్ధి చేసే విధానాలను పాటించి సమస్య నుంచి గట్టెక్కవచ్చని కలెక్టర్ సూచించారన్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన కలెక్టర్ శుక్లా, చొరవ చూపిన ఎమ్మెల్యే పొన్నాడకు రొయ్యల కంపెనీ యజమానులు ధన్యవాదాలు తెలిపారు. కంపెనీల ప్రతినిధులు అంకాడి అంజిబాబు, విత్తనాల కరిమల స్వామి, సంగాడి రాజు, రేకాడి నరసింహమూర్తి, తాతాజీ, కొప్పాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూరల్ హబ్‌ని సందర్శించిన నాబార్డు ప్రతినిధులు


రూరల్ హబ్‌లో సోమినాయుడు, రామారావు తదితరులు

అల్లవరం: దేవగుప్తం పంచాయతీ పరిధిలోని వారపు సంతలో నాబార్డు, దేవగుప్తం పీఏసీఎస్ సంయుక్తంగా నిర్మించిన రూరల్ హబ్‌ని ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యులు, సొసైటీ చైర్మన్ జున్నూరి రామారావుతో కలసి నాబార్డు డీడీఎం సోమినాయుడు బృందం శుక్రవారం సందర్శించింది. నాబార్డు, దేవగుప్తం సొసైటీ సంయుక్తంగా రూ. 24 లక్షలతో నిర్మించిన రూరల్ హబ్‌ని ఇటీవల వినియోగంలోకి తీసుకొచ్చారు. రూరల్ హబ్‌లో ఏర్పాటు చేసిన వారపు సంతను నాబార్డు ప్రతినిధుల బృందం సందర్శించి సంతృప్తి వ్యక్తం చేసింది. వర్షాలు, అధిక ఎండల సమయాల్లో వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడేవారమని, ఇప్పుడు ఆ సమస్య ఉండదని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు ముత్తాబత్తుల రాంబాబు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా కోటా పుదుచ్చేరికి వర్తించదు

యానాం: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ తీసుకువచ్చిన చట్టం పుదుచ్చేరికి వర్తించదని సామాజికవేత్త సబ్బతి శ్రీనివాసరావు శుక్రవారం పేర్కొన్నారు. పార్లమెంట్‌లో పాసయిన మహిళాబిల్లు వల్ల లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభలతో పాటు అసెంబ్లీ ఉన్న కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీలో మాత్రమే మహిళలకు కోటా అమలవుతుందని పేర్కొన్నారు. మహిళలకు కోటా కలిస్తూ తీసుకువచ్చిన యాక్టులో 239 ఎఎ దేశరాజధాని ఢిల్లీనే పేర్కొన్నారని, 239ఎలోని పుదుచ్చేరిని పేర్కొనలేదని దీంతో ఆ కోటా వర్తించదని అన్నారు. అదేవిధంగా జమ్మూ, కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతాలను సైతం మహిళాబిల్లులో పేర్కొనలేదన్నారు.

స్వదేశీ విజన్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోను పర్యాటక ప్రాజెక్టులు అమలు చేసేందుకు వీలుగా రూ.150 కోట్లు కేటాయించాలని పర్యాటక శాఖామంత్రి లక్ష్మీనారాయణ కేంద్ర పర్యాటక శాఖా మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. శుక్రవారం స్వదేశీ దర్శన్ 2.0 ప్రాజెక్టు నేపథ్యంలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మంత్రి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వదేశీ దర్శన్ 1.0 ప్రాజెక్టుకు కేంద్రం గతంలో రూ.133.31 నిధులు ఇచ్చిందన్నారు. 20 బీచ్ టూరిజమ్ ప్రాజెక్టులు, హెరిటేజ్, ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో స్వదేశీ దర్శన్ 2.0కు నిధులు కేటాయించాలని కోరారు.

ఈడబ్ల్యూఎస్‌పై చర్చావేదిక రేపు

యానాం: విద్య, ఉద్యోగ అవకాశాల్లో 10 శాతం ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్‌పై ఆదివారం ప్రజా చర్చావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రకటనలో తెలిపారు. ఈడబ్ల్యూఎస్ ప్రధాన లక్ష్యం నెరవేరడం లేదని, ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలతో పాటు మైనారిటీలు నష్టపోతున్నామని వారు తనకు ఫిర్యాదు చేయడంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక గాజుల మినీ కల్యాణ మంటపం, అగ్రహారంలో జరిగే చర్చకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, యువత హాజరుకావాలని కోరారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలో ఆయా గ్రామాల్లో భక్తులు గణనాథునికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పలగుప్తం గ్రామంలో భైరవభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి స్వామివారి విగ్రహం ఆవరణలో గణపతి హోమాన్ని వైభవంగా జరిపించారు. వాడపర్రు గ్రామంలో నిలిపిన లక్ష్మీగణపతి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలకరించి పూజలు చేశారు. వానపల్లిపాలెం గ్రామంలో ఆదిగణపతి ఆలయంలో స్వామివారికి గరికపూజ చేసి అందంగా అలకరించారు. తెల్లవారుజామున ఆలయంలో శ్రీసీతారామచంద్రమూర్తి కలశస్థాపన చేసి, త్రైఏకాహ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి 72 గంటల పాటు భజనలు చేయనున్నారు.

మొగ తవ్వకాల పరిశీలన

అల్లవరం: ఇసుక మేటలతో మూసుకుపోయిన ఎస్.రామేశ్వరం మొగలో మూడు రోజులుగా పొక్లెయిన్ సహాయంతో తవ్వకాలు నిర్వహిస్తున్నారు. సుమారు రూ.20 లక్షలతో చేపట్టిన మొగ తవ్వకాలను డ్రెయిన్స్ డీఈ కిషోర్, ఏఈ సునీత శుక్రవారం పరిశీలించారు. రెండు రోజుల్లో తవ్వకాలు పూర్తయి, ముంపు నీరు సముద్రానికి వెళుతుందని వారు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు వినతి

అమలాపురం రూరల్: వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు వల్లూరు సత్తిబాబు, యార్లగడ్డ సత్తిబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవలు వేగవంతం చేయాలి

యానాం: యానాం రెవెన్యూశాఖలో ప్రజాపయోగపరమైన ధ్రువపత్రాల జారీ తదితరమైన వాటిని త్వరగా జారీచేసి తద్వారా ప్రజలకు ఉపకరించేలా విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగృహంలో నూతనంగా యానాం డిప్యూటీ తహసీల్దార్‌గా నియమితులైన దండపాణి ఎమ్మెల్యే అశోక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

జ్యూట్ బ్యాగుల పంపిణీ

అమలాపురం రూరల్: ప్లాస్టిక్ వినియోగం తగ్గింపులో భాగంగా కామనగరువు గ్రామంలో స్ఫూర్తి ఫౌండేషన్, మాజీ సర్పంచ్ రాజులపూడి భీముడు, మహేష్ కుటుంబ సభ్యులు 2,000 జ్యూట్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ బ్యాగుల వినియోగంతో ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుందని భావించి ఈ ప్రయత్నం చేశామని వారు తెలిపారు.

ఎలుకల నిర్మూలనపై అవగాహన


రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సునీత

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై సర్పంచ్ పెనుమల సునీత ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు. ఎలుకల నివారణ మందు వినియోగించే విధానాన్ని వివరించారు. వరి రైతులకు బ్రోమోడయోలిన్ మందు ఉచితంగా పంపిణీ చేశారు. బండారులంక వీహెచ్ఏ ఎం.పృథ్వీరాజ్, రైతులు బొంతు కృష్ణమూర్తి, చప్పిడి సాయి కృష్ణ, ఇళ్ల శ్రీను పాల్గొన్నారు.

అల్లవరం: వరి పంటలో ఎలుకల నివారణను రైతులందరూ సామూహికంగా చేపట్టాలని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. అల్లవరం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఉచిత ఎలుకల మందు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండలంలోని అన్ని ఆర్బీకేల్లో ఎలుకల మందుని పంపిణీ చేశామని ఏఓ తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.మౌనిక, అల్లవరం ఆర్బీకే సలహా మండలి వైస్ చైర్మన్ యల్లమిల్లి వెంకటరమణ, వీఏఏ శుభగణేష్, ఈశ్వర్, రైతులు నడింపల్లి సూర్యనారాయరాజు, బుద్ధరాజు సత్యనారాయణ, రమణాతి రమణ, రాయుడు శివన్నారాయణ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలన్నింటిలో రైతులకు బ్రోమోడయోలిన్ మందును పంపిణీ చేసినట్లు ఏవో జి.కుమార్‌బాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని ఉప్పలగుప్తం ఆర్‌బీకే పరిధిలో రైతులకు మందును అందించారు. వరి క్షేత్రాల్లో రైతులు సామూహికంగా మందును ఉపయోగించి ఎలుకల బారి నుంచి వరి పంటను కాపాడుకోవాలని సూచించారు. మందును మిశ్రమించే విధానాన్ని ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సహాయకులు ఓలేటి శివాజీ, రైతులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: రైతులు అందరూ ఏకకాలంలో పొలాల్లో సామూహిక ఎలుకలు నివారణపై చర్యలు చేపడితే ఫలితం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. కందికుప్పలో ఆయన అధ్యక్షతన శుక్రవారం పొలం బడి కార్యక్రమం జరిగింది. ఎలుకల నివారణకు 4 గ్రాముల బ్రోమోడియోన్, నూకలు 192 గ్రాములు , వంట నూనె 4 గ్రాములు కలిపి పొట్లాలు కట్టి బొరియలలో పెట్టాలన్నారు. రైతులు అందరూ ఒకేసారి సామూహికంగా ఎలుకల మందును పెడితే సమర్థవంతంగా ఎలుకలను నివారించవచ్చునన్నారు.

ఘనంగా ఫార్మసీ వారోత్సవాలు

అవయవ దానంపై ఫార్మశీ విద్యార్థుల ర్యాలీ


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీలోని కోరింగా ఫార్మసీ కళాశాలలో ఫార్మసీ వారోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆరవ రోజున కళాశాల విద్యార్థులు అవయవదానం ప్రాముఖ్యత, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కోరంగి కళాశాల నుంచి తాళ్లరేవు వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ ప్రగళ్లపాటి కనకరాజు ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమానుద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణజ్యోతి మాట్లాడుతూ వారోత్సవాలలో భాగంగా అనేక అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతీ ఒక్కరూ అవయవ దానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణ భిక్ష పెట్టినవారమవుతామన్నారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించామన్నారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి 216 కోరంగి పోలీస్‌స్టేషన్ వద్ద విద్యార్థులు మానవహారం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, అమృత ఎమర్జన్సీ ఆస్పత్రి వైద్యులు కిరణ్, అధ్యాపకులు గోవింద్ కమల, కళాశాల ఏఓ మాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అద్దం పట్టినట్లుంది

కాట్రేనికోన: కేంద్ర ప్రభుత్వం నారీ శక్తీవందన్ పేరుతో ప్రవేశపెట్టిన మహిళా బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదించడం మహిళా సాధికారతకు అద్దం పట్టినట్లు ఉందని వైఎస్సార్ సీపీ మండల మహిళా కన్వీనర్ మోకా చంద్ర నాగరత్నం అభిప్రాయపడ్డారు. కాట్రేనికోన రామస్వామితోటలో ఆమె అధ్యక్షతన మహిళలు సమావేశం అయ్యారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లును ఉభయ సభలు ఆమోదం పొందడంతో మహిళలకు పెద్ద పీట వేసినట్లు ఉందన్నారు. రాష్ట్ర చిన్న మధ్య తరగతి పరిశ్రమల శాఖ డైరెక్టరు నల్లా బేబి జానకి మాట్లాడారు. మహిళా బిల్లు ఆమోదం పొందడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ కేక్‌ను కట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మహిళల పేరుతో అందించడం, మంత్రి వర్గంలో 50 శాతం మహిళలకు అవకాశం ఇవ్వడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, మహిళలు పాల్గొన్నారు.